క్లుప్తంగా

ఆచంటలో కేంద్ర బలగాల కవాతు



ఆచంటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహణలో భాగంగా జిల్లా ఎస్పీ వేజేండ్ల అజిత్ ఆదేశాలతో కేంద్ర పోలీసు దళం సీఐఎస్ఎఫ్ బుధవారం ఆచంటలో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించేందుకు సెంట్రల్ ఆర్మీ పోర్సు భద్రత, భరోసా ఉంటుందని తెలిపేందుకు కవాతు నిర్వహించారు. కవాతులో పెనుగొండ సీఐ నక్కా రజనీ కుమార్, ఆచంట ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దళిత గర్జన సభ విజయవంతం చేయాలి



దళిత గర్జన సభ పత్రికలను ఆవిష్కరిస్తున్న నన్నేటి పుష్పరాజు

పాలకొల్లు అర్బన్: భీమవరం నాచువారి సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 9న నిర్వహిస్తున్న దళిత గర్జన సభకు జిల్లా నలు మూల నుంచి దళిత నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు కోరారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత వాడల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాలన్నారు. అలాంటి ప్రభుత్వాలకే మాలమహానాడు అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు సంది జయరాజు, నన్నేటి నాగరాజు, మర్రిపూడి నానిబాబు, కిరణ్‌కుమార్, ఎన్నాబత్తుల శ్రీనివాస్, గోగులమండ దాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న పాగాకు ప్రత్యేక పూజలు



మల్లన్న పాగాకు పూజలు చేస్తున్న శ్రీనివాసరావు దంపతులు

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామికి అలంకరించే మల్లన్న పాగాకు ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం శ్రీనివాసరావు ఆయన నివాసంలో పాగాకు పూజలు నిర్వహించారు. స్వామివారి పాగాను నేత నేచిన వరదా సోమేశ్వరరావు శివరాత్రికి వారం రోజులు ముందు భక్తుల కోరిక మేరకు ఇంటికి తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు తన ఇంటి వద్ద తమ బంధువులు, స్నేహితులతో కలిసి పూజలు చేశారు. అలాగే అధ్యాపకుడు బొక్కా రమాకాంత్ గృహంలో ప్రత్యేక పూజలు చేశారు.

మిచాంగ్ బాధిత రైతులకు నష్టపరిహారం జమ

యలమంచిలి: ఖరీఫ్–2023లో వచ్చిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాల వల్ల వరి పంట నష్టపోయిన రైతుల ఖాతాలకు పంట నష్ట పరిహారం కింద రూ.కోటి 65 లక్షలు జమయ్యాయని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 969.2 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. హెక్టారుకు రూ.17 వేలు చొప్పున 1889 మంది రైతులకు రూ.1,64,76,400 జమైనట్లు ఆమె వివరించారు.

16న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: వాదించుకుంటే ఎవరో ఒక్కరే గెలుస్తారని అదే సమస్యను పరిష్కరించుకుంటే ఇద్దరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని మండల న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం కోర్టు హాలులో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ మార్చి 16న స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. చిన్న చిన్న వివాదాలు పెద్దవి కాకుండా పరిష్కరించుకుంటే ఎవ్వరికీ పట్టుదలలు పెరగవన్నారు. అంతే కాకుండా కోర్టుల చుట్టూ తిరిగే సమస్య, సమయం, నగదు వృథా కాకుండా ఉంటాయన్నారు.

వైభవంగా కైలాస గౌరీ నోములు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో కైలాస గౌరీ నోములు నిర్వహించారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ఈ నోముల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం మహిళలకు పసుపు కుంకుమలు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ బొండాడ వినయ, సెక్రటరీ బి కుమారి, ట్రెజరర్ వి.మాలతి పాల్గొన్నారు.

ఓం శివోహం..రుద్రనామం భజేహం

- గ్రామాల్లో శివరాత్రి సందడి
- ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు



నరసాపురం రూరల్: దుర్గాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



నరసాపురం రూరల్: కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: తీర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభమైన శివరాత్రి మహోత్సవాలకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ దేవాలయంలో పూజలు చేస్తే భక్తుల కోర్కెలు నెరవేరుతాయని ప్రతీతి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. లక్ష్మణుడు శివలింగం ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో ఏటా శివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం జరిగే శివరాత్రి వేడుకలు, రథోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండే విధంగా ప్రత్యే భద్రతా ఏర్పాట్లును చేస్తున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

లక్ష్మణేశ్వరంలోని ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, త్రిశూలపూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ తదితర పూజలతో పాటు గిరిజాతనయ శ్రీ దుర్గామాతకు, శ్రీ లక్ష్మణేశ్వరస్వామివారికి వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ మంచిలి దుర్గాప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకస్వామి యలమంచిలి ప్రసాద్‌శర్మ తదితరులు పాణిగ్రహణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నున్నబోయిన ఉదయభాస్కర సుబ్రహ్మణ్యం, దుర్గా భవాని, దొంగ మురళీకృష్ణ, మణిదీపిక దంపతులు ఆధ్వర్యంలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కంకటాల పెద్దిరాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

శివదేవస్వామికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్ : మండలంలోని శివదేవునిచిక్కాలలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి పాంచాహ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ అంకురార్పణ పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం నందివాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వామి ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి శివాజీ బ్రహ్మత్వంలో పూజలు చేశారు.



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో లక్ష్మణుడు ప్రతిష్ఠించిన శివలింగం



పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చక స్వాములు

నేటి నుంచి జుత్తిగ, నత్తారామేశ్వరంలో శివరాత్రి ఉత్సవాలు

పెనుమంట్ర: మండలంఓలని నత్తారామేశ్వరంలో ఉన్న శ్రీఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు గురువారం నుంచి 10వ తేదీ వరకూ జరుగుతాయని అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి బుధవారం తెలిపారు. 7వ తేదీ రాత్రి శ్రీఉమారామలింగేశ్వరస్వామివారికి లోక కల్యాణార్థం ప్రవాస భారతీయుడు తాడి వెంకటరెడ్డి, వెంకట కుమారి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా 8న తెల్లవారు జామున భక్తులు గోస్తనీలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా రథోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయంలో.....

మహాశివరాత్రి సందర్భంగా శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యుడు వెలగల వెంకట స్వామిరెడ్డి బుధవారం తెలిపారు. 7వ తేదీరాత్రి సత్తిరాజు పవనచంద్ర, శ్రీచందన దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరుగుతుందని 8న ఉదయం నుంచి ఆలయ ఆవరణలో తీర్థ మహోత్సవం జరుగుతుందని ఈసందర్భంగా ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. సాయంత్రం నత్తారామేశ్వరం, జుత్తిగ పొలిమేరలో రామేశ్వరస్వామికి, సోమేశ్వరస్వామికి ఎదురు సన్నాహ రథోత్సవం జరుగుతుందన్నారు.



నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ సముదాయం

మరింత సుందరంగా కాటన్‌పార్క్



కాటన్‌పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కాటన్‌పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాటన్ పార్కులో 15వ ఆర్థిక సంఘం రూ.1.38 కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనులను బుధవారం ముదునూరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పార్కును పూర్తి స్థాయిలో ఆధునీకరించామని చెప్పారు. పిల్లలకు వేసవి సెలవులు నాటికి పార్కులో అదనపు హంగులు ఏర్పాటు చేయడానికి ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ఇప్పటికే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు బళ్ల తాతాజీ, పాలపర్తి బోస్ తదితరులు ఉన్నారు.

జగనన్న పాలనలో మహిళలకు, పేదలకు గౌరవం

పోడూరు: సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలోని మహిళలకు, పేదలకు గౌరవం పెరుగుతున్నదని జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. మండలంలోని కొమ్ముచిక్కాల, వేడంగి, మట్టపర్రు, పెనుమదం, రావిపాడు, వద్దిపర్రు, పెనుమదం, జిన్నూరు గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ నిధులు దాదాపుగా రూ.3.6 కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్‌సెంటర్‌లను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ ప్రారంభించారు. అలాగే జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనంత భారీస్థాయిలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నారన్నారు. ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలకు లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అన్నివర్గాలకు సమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అధికారంలోకి రాగానే గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్‌సెంటర్లు ఏర్పాటు చేసి సొంతభవనాలు నిర్మించడం ద్వారా దేశానికి వెన్నముకగా ఉన్న పల్లెలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ , మండల కన్వీనర్ పితాని చిన్నా, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, వైస్‌ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఎంపీడీఓ డి.సుహాసిని, తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొమ్ము చిక్కాలలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు

జగన్‌కు యువత పెద్దపీట

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతకు పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు తెలిపారు. బుధవారం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేగి రాజశేఖర్ (బాబి) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతీ యువతకు చేరువయ్యాయన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా అనేక మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్న చీఫ్‌విప్ ముదుపూరి ప్రసాదరాజు సేవలు అభినందనీయమని యూత్ అధ్యక్షుడు వేగి రాజశేఖర్(బాబి) తెలిపారు. కులాలు, మతాలు తేడా లేకుండా అన్ని వర్గాలకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నారన్నారు. సమావేశంలో యూత్ నాయకులు కోడెళ్ళ వెంకట్రావు, కడలి నాగార్జున, షేక్ బాషా, ఎన్నాబత్తుల అశోక్ కోనాల ప్రసాద్, పోతుల ఫణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

పాలకొల్లు అర్బన్: ట్రస్ట్ బోర్డు పాలకవర్గ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సాలా దేవి సూచించారు. పట్టణంలోని చిన కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహి/ంచారు. ఈ కార్యక్రమంలో దేవి ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీలుగా కంచర్ల నాగవెంకట వీర్రాజు, దేవరకొండ సురేష్‌కుమార్, పినిశెట్టి పుణ్యవతి, జింగాల లక్ష్మీజ్యోతి, పెదపెంకి దుర్గాదేవి, ఉన్నమట్ల లక్ష్మి, ఎక్స్ అఫిషియో సభ్యులుగా గోవర్ధనం కృష్ణమాచార్యులతో ఆలయ ఈవో ముత్యాల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గ సభ్యులను ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, ఆలయాల చైర్మన్‌లు మామిడి బాబు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, చినిమిల్లి గణపతిరావు, రేలంగి దున్న, కాసాని కేశవరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, బండి రమేష్ తదితరులు అభినందించారు.



వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం

వైద్య సేవలను వినియోగించుకోవాలి

పాలకొల్లు అర్బన్: అర్హులైన ప్రభుత్వ వైద్యులను గ్రామాలకు పంపించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ కోలాటి రాధ అన్నారు. మండలంలోని కాపవరం గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని సర్పంచ్ రాధ ప్రారంభించి మాట్లాడారు. లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకుని బీపీ, సుగర్, ఇతర వ్యాధులకు పరీక్షలు చేయించుకుని మందులు సక్రమంగా వాడాలని సూచించారు. అలాగే ఆరోగ్యశ్రీకి సంబంధించి వివరాలు తెలుసుకుని వైద్య సేవలు ఉచితంగా పొందాలని సూచించారు. శిబిరంలో 302 మందిని పరీక్షించి మందులు అందజేశారు. అలాగే 86 మందికి కంటి పరీక్షలు చేసి 11 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. 26 మందికి కళ్లజోళ్లు అందించడానికి చర్యలు తీసుకున్నారు. డాక్టర్లు సుష్మ, సంతోష్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, డి.కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కట్టా హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో...

నరసాపురం రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటూ వైద్యం చేయించుకోవడానికి దిక్కు తోచని స్థితిలోఉన్న రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కొండంత అండగా నిలుస్తోందని సీతారాంపురం సౌత్ గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకట్ అన్నారు. బుధవారం గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో వైద్యం అవసరమైన వారిని గుర్తించి వచ్చే విధంగా వలంటీర్లు, ఆశా వర్కర్లు ముందు నుంచి కృషి చేయడంతో పెద్ద ఎత్తున రోగులు శిబిరానికి హాజరయ్యారు. గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో నేత్ర, ఆర్థోపెడిక్, చెవి,ముక్కు,గొంతు, చర్మ సమస్యలు, చిన్నపిల్లలు, గైనిక్ తదితర వైద్యులు రాజేష్, ఫణీంద్ర, రంజిత్, నాగదానేశ్వరి తదితరులు సేవలందించారు. సుమారు 700 మంది రోగులు ఈ శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందారు.



పాలకొల్లు అర్బన్: కాపవరం గ్రామ సచివాలయ ఆవరణలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్



నరసాపురం రూరల్: సీతారాంపురంలో మందులు అందజేస్తున్న సిబ్బంది

రేపటి నుంచి భద్రకాళీ వీరభద్రస్వామి ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ కొత్తపేట ప్రాంతంలో కొలువైఉన్న శ్రీ భద్రకాళీ వీరభద్ర స్వామి మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభకానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 17వ వరకూ పది రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 12 గంటల వరకూ స్వామివారి ఆనసంబరం నిర్వహిస్తారు. ఈ సంబరంలో మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ పంజాబ్, కేరళ కళాకారులతో వాయిద్యాలు, శక్తి వేషాలు, గరగల నృత్యాలు, సన్నాయి వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఊరేగింపు అనంతరం రాత్రి నిప్పుల గుండం ఏర్పాటు చేస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని, ఆలయ కమిటీ సభ్యులు బాసిన గున్నేశ్వరరావు, మానెం బసవరాజు, బాసిన సత్యనారాయణ తదితరులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఆచంటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ వేజెండ్ల అజిత్

పెనుగొండ: ఐదు రోజుల పాటు ఆచంట రామేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు చేసిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వేజేండ్ల అజిత్ బుధవారం పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామ్‌చందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాటు చేయాల్సిన బందోబస్తులు నిర్లక్ష్యం వహించవద్దంటూ సూచనలు చేశారు. క్యూలైన్ల ఏర్పాట్లుపై ఆరా తీశారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)

యలమంచిలి: ఉపాధ్యాయ సంఘంగా ఆవిర్భవించినా, కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం వరకే పరిమితం కాకుండా సామాజిక స్పృహతో పని చేసే సంఘం యూటీఎఫ్ మాత్రమేనని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. ఇటీవల యూటీఎఫ్ మండల శాఖ 5, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బుధవారం చిలుకూరి సుబ్బారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన సభలో బహుమతులు అందజేశారు. సభలో పాల్గొన్న ఐవీ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ వసతులు కల్పించడం శుభ పరిణామం అన్నారు. 10వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ఓవరాల్ ఫస్ట్ సాధించిన మట్లపాలెం పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుబ్బల మీనాక్షికి, తెలుగు మీడియంలో ఓవరాల్ ఫస్ట్ వచ్చిన ఏనుగువానిలంక హైస్కూల్ విద్యార్థిని రాయి మౌనికతోపాటు 10, 5వ తరగతుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో సబ్జెక్టుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందుగా ఇటీవల మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్ర పటానికి ఆయన భార్య షేక్ సుభానీబేగం, కుమారుడు షేక్ అబుల్ కలాం ఆజాద్ సమక్షంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఎకెవి రామభద్రం, బొర్రా గోపిమూర్తి, పోలిశెట్టి క్రాంతికుమార్, గుత్తిందీవి శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు మేడపాడు సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.